క్లుప్తంగా

రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలి



కొల్లిపర: రక్తహీనతపై ప్రతి తల్లిదండ్రులు యువత చిన్నారులు పూర్తి అవగాహన కలిగి ఉండి రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్వాడి సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చెముడుబాడు శ్రీ అంగన్వాడి కేంద్రంలో కిశోర బాలిక నందు కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై చిన్నారుల తల్లిదండ్రులకు యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల వచ్చే రుగ్మతలు, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త కే.అనిత, చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు, యువత పాల్గొన్నారు.

ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో-100 ఈఎన్‌టీ-50 సెక్రాటిక్ విభాగాలకు చెందిన 50 మంది వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

తెనాలిలో శాంతి సువార్త సంగీత మహోత్సవాలు



తెనాలి: పీస్ చర్చ్ ఆధ్వర్యంలో స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో మూడురోజులపాటు జరిగే శాంతి సువార్త సంగీత మహోత్సవాల గోడప్రతులను శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. ఆదివారం రాత్రి వరకు జరిగే ఉత్సవాల్లో దైవజనులు జాన్ వెస్లీ, జాన్ మంగాచార్యులు, బ్రదర్ మాథ్యూస్, బిషప్ అబ్రహాము కూచిపూడి వాక్య సందేశం అందిస్తారని తెలిపారు. గొప్ప సువార్త గాయకులు సువార్త గానాలాపన చేస్తారని తెలిపారు.తెనాలి పరిసర ప్రాంత భక్తులు పాల్గొని సభలు జయప్రదం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ పాస్టర్స్ కో-ఆర్డినేటర్స్ బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ చిట్టిబాబు, బ్రదర్ అబ్రహాము రెడ్డి బోయిన, మార్పు స్టీఫెన్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడ-చెన్నై రైలు మార్గంలో తెనాలి సమీపంలోని మల్లెపాడు గేటు వద్ద శుక్రవారం సుమారు 35 నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్టీ మహిళ అంత్యక్రియలకు పెన్నీ మినిస్ట్రీస్ తోడ్పాటు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో కొమ్మమూరు కాల్వకట్టపై జీవిస్తున్న యానాది సామాజికవర్గానికి అంత్యక్రియలు సమస్యగా మారింది. ప్రత్యేకంగా వారికి శ్మశానం లేకపోవటంతో కాల్వగట్టుపైనే భూస్థాపితం చేస్తుండేవారు. కాల్వకట్ట ఆక్రమణలకు గురవటంతో అక్కడ అవకాశం లేకుండా పోయింది. గురువారం అనారోగ్యంతో మృతిచెందిన తలపల సీతమ్మ అంత్యక్రియలకు ఈ సమస్య ఎదురైంది. ఎంతోకాలంగా వారికి నిత్యావసరాలు, దోమతెరలు సమకూర్చుతూ, రేషను కార్డులు, ఆధార్ కార్డులు వచ్చేందుకు సహకరిస్తున్న పెన్నీ మినిస్ట్రీస్‌ను సంప్రదించారు. ఈ సంస్థ వ్యవస్థాపకుడైన సినీదర్శకుడు దిలీప్‌రాజా అక్కడకు చేరుకుని, సీతమ్మ అంత్యక్రియలు జరిగేందుకు చొరవచూపారు. ఎలాంటి ఆసరా లేని కొలకలూరు కాల్వగట్టు యానాదులకు నివాస వసతిని సమకూర్చాలని అధికారులకు ఆయన విజ్ఞప్తిచేశారు.

వీరాంజనేయస్వామికి నింబఫల పూజ

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి విశేషంగా నింబఫల పూజ నిర్వహించారు. ముప్వ మల్లికార్జునరావు దంపతులు ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపించారు.



మార్కెట్ యార్డు ఆవరణలో కూలిన భారీ వృక్షం



మహేంద్రదేవ్ కాలనీలో ఇంటిపై వాలిన చెట్టు



కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిలో భారీ వర్షం

కూలిన పలు చెట్లు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం రాత్రి వాతావరణం ప్రశాంతంగా ఉన్నప్పటికి అర్ధరాత్రి నుంచి ఒకసారిగా మార్పు వచ్చింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచి ఈదురుగాలులు వీచాయి. కొద్దిసేపటికే భారీ వర్షం గాలులకు తోడవడంతో పట్టణమంతా అంధకారమైపోయింది. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అలాగే గాలులకు మహేంద్రదేవ్ కాలనీలోని ఓ ఇంటిపై చెట్టు కూలింది. కానీ ఎటువంటి నష్టం జరగలేదు. అలాగే పట్టణంలోని మార్కెట్ యార్డులో భారీ వృక్షం కులింది. ఇతర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఉదయమే మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి విరిగిపడిన చెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని కమిషనర్ తెలిపారు. వారి వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తూకం, ప్యాకింగ్‌లకు నిబంధనలు తప్పనిసరి

లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి



మాట్లాడుతున్న మాధురి

తెనాలి: దాల్‌మిల్లుల యాజమాన్యం తూకం, ప్యాకింగ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి స్పష్టంచేశారు. గుంటూరు, తెనాలి, వినుకొండలోని దాల్‌మిల్స్ అసోసియేషన్లకు శుక్రవారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 20న ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సౌరభ్‌గౌర్ ఆదేశాలతో ఈనెల 8వ తేదీనుంచి 20వ తేదీ వరకు తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో వర్తకసంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని దాల్‌మిల్స్ అసోసియేషన్లతో ఏర్పాటైన సదస్సుకు అధ్యక్షత వహించిన జాయింట్ కంట్రోలర్ మాధురి మాట్లాడుతూ, దాల్‌మిల్లుల్లో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌ను ఏటా విధిగా లీగల్ మెట్రాలజీచే ధృవీకరించుకోవాలని సూచించారు. ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్, 2011 ప్రకారం 25 కిలోలలోపు ప్యాక్ చేసిన బ్యాగ్స్‌పై ఉండాల్సిన డిక్లరేషన్స్‌ను తెలియజేశారు. ప్యాక్ చేసిన వస్తువు సాధారణ పేరు, తయారీదారు పూర్తి చిరునామా, వస్తువు నికర బరువు, తయారీ నెల, సంవత్సరం, వస్తువు గరిష్ట చిల్లర ధర, కస్టమర్ కేర్ ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ, యూనిట్ సేల్ ప్రైస్‌ను విధిగా ముద్రించాలని చెప్పారు. 25 కిలోలకన్నా పై ప్యాకింగుల్లో ప్యాక్ చేసిన వస్తువు పేరు, తయారీదారు పూర్తి చిరునామా, నికర బరువు ఉండాలని, ఎవరైతే ప్యాకింగ్ చేస్తున్నారో వారు లీగల్ మెట్రాలజీ శాఖచే ప్యాకర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు. లీగల్ మెట్రాలజీ గుంటూరు, పల్నాడు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు జి.కొండారెడ్డి, ఎన్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు జీఎస్ సునీల్‌రాజు, బి.శేషసాయి, జి.సాయిశ్రీకర్, షేక్ జానాసైదా, దాల్ మిల్స్ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



బ్రోచర్ విడుదల చేస్తున్న శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం నేతలు

తెనాలిటౌన్: తెనాలి వైకుంఠపురంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి ఏటా జరుగు బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈ నెల18వ తేదీ ఆదివారం శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవంనకు పద్మావతి అమ్మవారికి పుట్టినింటి వారిగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పండ్లు, పూలు, పూజా ద్రవ్యాలు సమర్పించుకునే బృహత్తర అవకాశం శ్రీ భద్రావతి సహిత శ్రీ భావనాఋషి దేవస్థానం పద్మశాలీయ బహుత్తమ సంఘానికి దక్కిందని సంఘ గౌరవాధ్యక్షుడు జొన్నాదుల మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక షరాఫ్ బజార్‌లోని భావనా ఋషి స్వామి దేవస్థానం వద్ద కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సంఘీయులు విడుదల చేశారు.

ఆదివారం సాయంత్రం 4 గంటలకు షరాఫ్‌బజార్‌లోని దేవస్థానం నుంచి పద్మశాలీయ సంఘీయులు, ముత్తైదువులు ఊరేగింపుగా మంగళ వాయిద్యాలతో వైకుంఠపురం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. విశేష సంఖ్యలో సంఘీయులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. 19వ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల దివ్య రథోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ ఊరేగింపు సందర్భంగా భావనాఋషి స్వామి దేవస్థానం వద్ద ప్రసాద వితరణ గావించనున్నట్లు భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆకురాతి శ్రీనివాసరావు, తిరువీధుల సాంబశివరావు, పచుమర్తి భాస్కరరావు, గుంటి వెంకట్, గట్టు బాల శ్రీనివాసరావు, ఆలూరి శ్రీను, గోపాలరావు, భాస్కర్, వెంకటేష్, జొన్నాదుల శివ వెంకట సుబ్బారావు, బాలాజీ, లోకనాధరావు, గిరీష్, రామారావు, డి.తారక సాయినాథ్, టి.వెంకట శివ సత్యనారాయణ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

చిరస్మరణీయుడు సంగీత కళాకారుడు పెద్దిరాజు

సంతాపసభలో నటుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్



చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సభ్యులు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత కళాకారుడు తాడివలస వెంకట పెద్దిరాజు సంతాపసభను శుక్రవారం సాయంత్రం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో నిర్వహించారు. అభ్యుదయ కళా సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభకు నటుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్ అధ్యక్షత వహించారు. కళ కళకోసం కాదు...ప్రజల కోసం అనే నినాదంతో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రదర్శనలకు పెద్దిరాజు సంగీత సహకారం అందించారని వెంకట్ గుర్తుచేశారు. వివిధ పోటీల్లో ఉత్తమ సంగీతానికి బహుమతులు కూడా అందుకున్నారని చెప్పారు. టి.రామారావు బ్యాండ్ గ్రూపుతో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారని, పలు నాటకాల్లోనూ నటించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 'కళాజాత'లోనూ సహకారం అందించారని చెప్పారు. తొలుత పెద్దిరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తబలా నాగప్రసాద్, సంగీత కళాకారులు విజయసారథి, ఎస్కే సుభాని, అలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్కే సైదా, టి.జగపతి, జి.ప్రకాష్, వి.వాసుకుమార్, వి.శ్రీనివాస్, జి.సుధీర్, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ఏవో బాలాజీ గంగాధర్



కనగాలలో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జీలుగ, జనుము అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఒక కేజీ జీలుగ రూ.123 కాగా సబ్సిడీపై రూ.61.50, అదే విధంగా జనుము పూర్తి ఖరీదు రూ.109 కాగా సబ్సిడీపై రూ.54.50కు అందిస్తున్నట్లు ఏవో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావల్సిన రైతులు పొలం పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్సు తీసుకొని ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా మండలంలోని కనగాల, ఆళ్ళవారిపాలెం గ్రామల్లో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

వేమూరు: వేమూరు మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జిల్లా స్పెషల్ అధికారి, కృతిక శుక్లా, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఆర్‌డీవో రామలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

రేపు కొల్లిపరలో మెగా వైద్య శిబిరం

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఆహార పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.భరత్ శుక్రవారం సి.హెచ్.సిలో ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో రక్త పరీక్షలు, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గైకాలజీ, ఆప్తమాలజీ, ఈ.ఎన్.టి, జనరల్ సర్జరీ సంబంధించిన డాక్టర్లు వైద్య శిబిరంలో పాల్గొని రోగులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలోని 20 గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



రేడియం జాకెట్‌లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

తెనాలిఅర్బన్: కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలుతీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శుక్రవారం ప్రభుత్వం పంపిన పలు రకాల వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ తెనాలి పరిధిలోని 400 మంది పారిశుద్ధ్య కార్మికులకు రేడియా జాకెట్ ఒకటి, సబ్బులు 12, కొబ్బరినూనె 4.2 కేజీలు, క్యాప్, హ్యాండ్ గ్లౌజులను ప్రతి ఏడాది పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా వీటిని కార్మికులకు అందజేయడం జరుగుతుందన్నారు. వీధి నిర్వహణలో అందరూ రేడియా జాకెట్లు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఆరోగ్యాధికారి ణిడాక్టర్ కె.హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు జయపాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం



జయపాల్ బాబు

తెనాలిఅర్బన్: మంగళగిరిలోని వీటీజెఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు, తెనాలి ఐతానగర్ వాసి మదిరా జయపాల్‌బాబుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆంధ్ర లయోలా కళాశాల చరిత్ర రీడర్ డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో షెడ్యూలు తెగల ప్రాథమిక విద్య-ప్రగతి, ప్రభుత్వ కృషి చారిత్రాక పరిశీలన, తూర్పు గోదావరి జిల్లా ప్రత్యేక అనుబంధం అనే అంశంపై రీసర్చ్ చేసినట్లు తెలిపారు. ఆయన పరిశోధన రికార్డులను పరిశీలించి నాగార్జున యూనివర్శిటీ ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కళాశాల కరస్పాండెంట్ వివి.తాతారావు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగేశ్వరరావు, యోగ గురువు ఎ.వెంకటేశ్వరయోగి, పలువురు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన



పట్టణంలో కళాజాతర నిర్వహిస్తున్న కళాకారులు

తెనాలిటౌన్: హెచ్‌ఐవీ ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవచైతన్య కళామండలి నిర్వాహకులు కృష్ణ కిషోర్ ప్రజలకు సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నవచైతన్య కళా మండలి కళా బృందంతో వీధి నాటకాల ద్వారా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో కళాజాతర నిర్వహించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపరాదని, ఎయిడ్స్ నివారణకు పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. విచ్చలవిడి శృంగారం ఎయిడ్స్‌కు దారి తీస్తుందని సూచించారు. కార్యక్రమంలో సిరి మహిళా సాధికారిత వెల్ఫేర్ సొసైటీ తెనాలి ప్రాజెక్టు మేనేజర్, ఎంఅండ్‌డీ, డీఎస్‌ఎం, ఓఆర్‌డబ్ల్యువో ఎడ్యుకేటర్, కళాకారులు పాల్గొన్నారు.

భవితతో చిన్నారులకు ఉత్తమ భవితవ్యం

సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ మట్ట జ్యోత్స్న



సర్వే నిర్వహిస్తున్న భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ

రేపల్లె : ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి భవిత స్కూలు ద్వారా విద్యాబుద్ధుల్ని అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ మట్ట జ్యోత్స్న తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ఆదేశానుసారం భవిత సిబ్బంది ఆధ్వర్యంలో రేపల్లె పట్టణ, మండలంలో నిర్వహిస్తున్న 0 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించి అనంతరం మాట్లాడారు. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకు భవిత స్కూలులో ఆట పాటలతో కూడిన విద్యను అందించి వారిని సాధారణ విద్యార్థుల వలె తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. విద్యాబుద్ధులతో పాటు ఫిజియోథెరపీ, ఆటలలో ప్రత్యేక శిక్షణ అందించబడునన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి వైకల్యానికి గురైన భవిత కేంద్రంలో గానీ, సర్వేకు వచ్చిన భవిత సిబ్బందికి గానీ వివరాలను తెలియజేసి సహకరించాలన్నారు. వినికిడి, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, ఆటిజం, శారీరక వైక్యల్యం వంటి 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే జూన్ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ పాల్గొన్నారు.

బీట్ ది హిట్ కార్యక్రమంలో పాల్గొనండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న ప్రక్కన చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రాన్ని శుభ్రత వైపు నడిపించేందుకు ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడోవ శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు బీట్ ది హిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 7గంటలకు శివాజీచౌక్ నుంచి మార్వాడి గుడి రోడ్డు మీదుగా గంగానమ్మపేట, మార్కెట్‌వరకు ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం 4 గంటల నుంచి అమరావతి ప్లాట్స్‌లోని జిల్లా వైద్యశాల నుంచి చెంచుపేట కోనేరు బజారు వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. వేసవి తీవ్రతను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే వేసవి నుంచి ఎలా కాపాడుకోవాలో ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని చెప్పారు. కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డెంగీ వ్యాధి.. అప్రమత్తంగా ఉండండి

వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రియాంక

తెనాలిఅర్బన్: డెంగీ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని నందులపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. దేశవ్యాప్తంగా మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవంగా ప్రకటించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెంగీ వ్యాధి ఆర్బో వైరస్ ప్రధాన కారణమని, ఆ వైరస్‌తో కూడిన ఏడిస్ దోమ కాటు వలన వ్యాధి వస్తుందని చెప్పారు. ఇది ఒకరి నుంచి ఒకరికి సోకే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా ప్రజలు దోమ తెరలు వాడటం, వస్త్రాలను పూర్తిగా ధరించడం, కిటికీలకు, తలుపులకు మేష్ బిగించడం వంటివి చేయాలన్నారు. సాలీపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి సహాయ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి మాట్లాడుతూ ప్రతిశుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమా కాంత్, ఫైలేరియా సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, సిబ్బంది పాల్గొన్నారు.